అంగన్‌వాడీ పిల్లలను కంటికి రెప్పలా కాపాడాలి

మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగ, వయోవృద్ధుల శాఖ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్

సమావేశంలో మాట్లాడుతున్న మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్

వికారాబాద్ మార్చి 20 : అంగన్‌వాడీ పిల్లలను కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగ, వయోవృద్ధుల శాఖ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, పిల్లల అంగవైకల్యం, తదితర అంశాలపై సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, సఖి, ఐసీపీఎస్ అధికారులు, సిబ్బందితో ప్రధాన కార్యదర్శి సమావేశం నిర్వహించి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. పిల్లలను వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో మాత్రమే పంపించాలని సూచించారు. పిల్లల జీవితాలను మెరుగుపర్చేందుకు శారీరక వైకల్యం, ఫిట్స్, ఉబ్బసం, ఆకస్మిక కదలికలు, స్నేహ తప్పడం, వినికిడి సమస్య, కారణం లేకుండా శిశువు ఏడ్వడం, మానసిక సమస్యలను గుర్తించి అవసరమైన చికిత్స చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సామ్, మామ్ పిల్లలు లేకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

జిల్లాలో బాల్యవివాహాలు జరుగకుండా చర్యలు తీసుకుంటూ, బాల్య వివాహాలపై సమాజంలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న అనాథాశ్రమాలను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు. పిల్లలకు మంచి అలవాట్లపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీలో మెరుగైన సౌకర్యాల కోసం టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్‌కు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించినట్లయితే పరిష్కారిస్తామని తెలిపారు. ముందుగా కలెక్టర్ ప్రతీక్‌జైన్, సంబంధిత అధికారులతో కలిసి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని వివిధ సమస్యలతో బాధపడే 140 మంది పిల్లల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. గ్రామాల్లో గృహాలను సందర్శించి వారం రోజుల్లో అనారోగ్యంతో కూడిన పిల్లల వివరాలను సేకరించి శస్త్ర చికిత్సల కోసం కృషి చేయాలని వైద్యాధికారులకు సూచించారు. 6 సంవత్సరాల లోపు పిల్లల పెరుగుదల, ఎదుగుదలకు అధికారులు కృషి చేయాలని ఆమె తెలిపారు. సమీక్షా సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ శాఖ డైరెక్టర్ శైలజ, ఆర్జేడీ మోతి, రాష్ట్ర సీడీపీవో అరుణ, డీపీవో జయసుధ, మానసిక వైద్యులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిసిన రైతులు

మా భూములు తీసుకోవద్దు

- మొండిగౌరెల్లి గ్రామస్తుల ఆవేదన
- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డిని కలిసిన రైతులు
- రైతులకు మద్దతుగా నిలువాలని వేడుకోలు

యాచారం, మార్చి 20 : మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన రైతులు ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిశారు. గ్రామంలో పరిశ్రమల ఏర్పాటు కోసం 821.11 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రైతులు సాగు చేసుకునే భూములను బలవంతంగా లాక్కునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని పేర్కొన్నారు. బాధిత రైతులకు బీఆర్ఎస్ అండగా ఉండాలని కోరారు. రైతు సమస్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వంపై రైతుల తరపున పోరాడేలా చేయాలని వేడుకున్నారు. భూసేకరణ నోటిఫికేషన్ రద్దు కోసం బీఆర్ఎస్ కృషి చేయాలని కోరారు. పేదల భూములను కాపాడి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు. మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన బాధిత రైతుల తరన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై పోరాడుతామని, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నిరుద్యోగ యువతకు 'రాజీవ్ యువ వికాస పథకం'

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, మార్చి 20 : తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, తద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'రాజీవ్ యువ వికాస పథకం' ప్రకటించిందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం క్రింద షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, అల్ప సంఖ్యాక వర్గాల కులాలకు సంబంధించి నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించడానికి ప్రణాళికను ఆమోదించిందన్నారు. అర్హత, ఆసక్తి కలవారు OBMMS ఆన్‌లైన్ పోర్టల్ https://tgobmmsne.cgg.gov.in ద్వారా దరఖాస్తులు నమోదు చేసుకోవచ్చన్నారు. అర్హత ప్రమాణాలు, పథకాలు, ఇతర వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చారని పేర్కొన్నారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 5 వరకు నమోదు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ అధికారులను వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కారుణ్య నియామకం కింద 16 మంది ఎంపిక

కారుణ్య నియామకాలకు ఎంపికైన 10 మందితో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, మార్చి 20 : జిల్లాలో కారుణ్య నియామకం కింద 16 మందిని ఎంపిక చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. గురువారం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా నుంచి కారుణ్య నియామకం కింద ఎంపికైన 16 మందిని తీసుకొని బస్సులో ఉదయం హైదరాబాద్‌కు బయలు దేరడం జరిగిందన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు రవీంద్ర భారతిలో సీఎం రేవంత్‌రెడ్డి వారికి నియామక పత్రాలు అందజేశారని తెలిపారు.

10వ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 20 : జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం అవుతున్న సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్పీ నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రాల వద్ద ఎవరూ గుమిగూడి ఉండకూడదన్నారు. కేంద్రాల లోపలికి సెల్‌ఫోన్ తీసుకెళ్లడానికి ఎవరికీ అనుమతి లేదని తెలిపారు. కేంద్రాల పరిసర ప్రాంతాలలో ఉన్న జిరాక్స్ కేంద్రాలు పరీక్ష సమయంలో మూసివేయాలని సూచించారు. ఎవరైనా పరీక్షా కేంద్రాల వద్ద చట్ట విరుద్ధమైన పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా, ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు. సమయపాలన పాటిస్తూ ముందుగానే పరీక్షా కేంద్రాన్ని చేరుకోవాలని సూచించారు. ఎవరికైనా ట్రాఫిక్ ఇబ్బందులు కలిగితే డయల్ 100కి కాల్ చేసి పోలీసు అధికారులకు తెలియజేయాలని ఆయన వివరించారు.

విద్యారంగంపై సవతితల్లి ప్రేమ

- రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 7.5 శాతం మాత్రమే నిధులు కేటాయించటం విడ్డూరం
- బడ్జెట్ పత్రాలను తగులబెట్టిన బీఆర్ఎస్వీ నాయకులు

ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో బడ్జెట్ పత్రాలను తగులబెడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఇబ్రహీంపట్నం, మార్చి 20 : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యారంగంపై సవతితల్లి ప్రేమ చూపుతున్నదని బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం అసెంబ్లీ సాక్షిగా విద్యారంగానికి 7.5 శాతం నిధులు కేటాయించటాన్ని వ్యతిరేకిస్తూ గురువారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను తగులబెట్టారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. గత బడ్జెట్ 2024-25 విద్యారంగానికి రూ.21389 వేల కోట్లను కేటాయిస్తే ఈ బడ్జెట్ 2025-26లో 23,108వేల కోట్లు కేటాయించింది. దేశంలో రాజస్తాన్, ఢిల్లీ లాంటి రాష్ట్రాలు విద్యపై 20 శాతానికి పైగా ఖర్చు పెడుతుంటే మన రాష్ట్ర ప్రభుత్వం విద్యపై పెట్టే ఖర్చు 7 శాతం దాటలేకపోతున్నదన్నారు. గత ఎన్నికల సమయంలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని ప్రగల్భాలు పలికి.. బడ్జెట్‌లో నిరాశనే మిగిల్చిందన్నారు. గత సంవత్సరం బడ్జెట్‌లో కేవలం 7.3 శాతం నిధులు కేటాయించింది. వాటిని కూడా పూర్తిగా విడుదల చేయలేదు. చిన్న రాష్ట్రాలైన ఈశాన్య రాష్ట్రాల్లో సైతం వాటి బడ్జెట్‌లో 12 నుంచి 13 శాతం నిధులు కేటాయిస్తుంటే మన రాష్ట్రంలో అరకొర నిధులు కేటాయించటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో 90 శాతం మంది విద్యార్థులు బీసీ, ఎస్సీ, ఎస్టీ బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులేనని, వారందరూ కూడా స్కాలర్‌షిప్‌పై ఆధారనడి విద్యను అభ్యసిస్తున్నారన్నారు. విద్యారంగసమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం ఉద్యమిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు వీరేశ్, మహేశ్, ప్రసాద్, వినోద్, విష్ణు, రవి, ఉదయ్, వంశీ, శివ ఉన్నారు.

వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

అభ్యర్థుల ఖర్చుల వివరాలు అందజేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం

ఆదిబట్ల, మార్చి 20 : గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చుల వివరాలను వెంటనే అందజేయాలని.. లేకపోతే ఎలక్షన్ కమిషన్ వారిపై చర్యలు తీసుకుంటుందని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా యొక్క నిరంతర ధ్రువీకరణ, వాటి సమర్పణ, ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న 6, 7, 8 ఫారమ్‌లు, బూత్ లెవల్ ఏజెంట్ల నియామకం వంటి పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సీఈవో సూచనల మేరకు అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ కేంద్రాలు, వాటికి కేటాయించిన బూత్ లెవల్ ఆఫీసర్లకు సంబంధించిన అంశాలను ఆమె వివరించారు. ఎల్‌బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, షాద్‌నగర్, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో 1065, పట్టణ ప్రాంతాల్లో 2436 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. వీటికి మొత్తంగా 3501 బూత్ లెవల్ పోలింగ్‌ఆఫీసర్లను ఇంతకు ముందు నియమించామన్నారు. లింగ ప్రాతిపాదికన ఈ నెల 20 నాటికి మొత్తం 8 నియోజకవర్గాల్లో పురుషులు 1889115, స్త్రీలు 1785501, ట్రాన్స్‌జెండర్లు 434 ఉండగా మొత్తం ఓటర్లు 36,75,050 ఉన్నారన్నారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న 6, 7, 8 ఫామ్‌లను త్వరగా క్లియర్ చేయడం జరుగుతుందని అన్నారు. రాజకీయ పార్టీల నుంచి నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు, వారి వివరాలను ఈఆర్‌వోలకు పార్టీ నాయకులు త్వరగా అందజేయాలని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, బీఎస్పీ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కుంట్లూరు వీధుల్లో వాల్‌పోస్టర్లు

పెద్దఅంబర్‌పేట, మార్చి 20: 'ఎటుపోతున్నది కుంట్లూరు పరువు..? వందేళ్ల చరిత్ర కలిగిన కుంట్లూరు గ్రామాన్ని భ్రష్టు పట్టిస్తున్న వ్యక్తులు ఎవరు?' అంటూ మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు గ్రామంలో వెలసిన వాల్‌పోస్టర్లు చర్చనీయాంశమయ్యాయి. పలు పత్రికల్లో వచ్చిన కథనాలను ఒకచోట చేర్చి రూపొందించిన వాల్‌పోస్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం గ్రామంలోని వీధుల్లో అతికించారు. ఈ విషయం మున్సిపాలిటీలో చర్చనీయాంశంగా మారింది. 'ఇలాగైతే కుంట్లూరు ప్రజలను ఎవరూ నమ్మరు. మేల్కొండి. నిత్యం భూతగాదాలతో ఇటు మీడియాలో, అటు పోలీసు స్టేషన్లలో కుప్పలుగా పెరిగిపోతున్న దరఖాస్తులు.. దీనికి కారణం ఎవరు? బాధ్యులు ఎవరు' అని రాసి ఉన్న వాల్‌పోస్టర్లను అతికించారు. గ్రామం బద్నాం అయ్యేందుకు కారకులు ఎవరవుతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. సోషల్ మీడియాలో సైతం ఇవి వైరల్‌గా మారాయి.

మిస్టరీ వీడింది..

బక్కని వెంకటేశ్‌ను భార్య, కన్నతల్లే కడతేర్చారు

హంతకులు తల్లి లక్ష్మమ్మ, భార్య సబిత

పెద్దేముల్, మార్చి 20 : పెద్దేముల్ మండల పరిధిలోని హన్మాపూర్ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున బక్కని వెంకటేశ్(33) తన ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మరణించిన సంఘటన తెలిసిందే. దీనికి సంబంధించి మృతుడి తమ్ముడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో వెంకటేశ్ భార్య సబిత, వెంకటేష్ కన్నతల్లి లక్ష్మమ్మ తామే వెంకటేశ్‌ను చంపామని ఒప్పుకొన్నారు. తాగుడుకు బానిసైన వెంకటేశ్ కొన్ని సంవత్సరాలుగా ప్రతి రోజూ పెట్టే టార్చర్ భరించలేకపోయాం. దీంతో ఉద్దేశపూర్వకంగానే ఇంట్లో ఉన్న ఇనుప రాడ్లతో చెవి వెనుక భాగంలో బలంగా కొట్టి చంపామని వారు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పెద్దేముల్ ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

చెరువుల పరిరక్షణపై హైకోర్టు సీరియస్

- దిద్దుబాటు చర్యలు చేపట్టిన జీహెచ్ఎంసీ
- తొలుత 11 చెరువులపై దృష్టి
- టెక్నికల్ కన్సల్టెంట్‌గా 'నీరి' నియామకం
- స్టాండింగ్ కమిటీ ముందుకు ప్రతిపాదన

సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ పరిధిలోని చెరువుల పరిరక్షణలో జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంపై హైకోర్టు ఆక్షింతలు వేసిన నేపథ్యంలో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. టెక్నికల్ కన్సల్టెంట్‌గా నీరి (జాతీయ పర్యావరణ, ఇంజినీరింగ్ పరిశోధన సంస్థ)ని నియమించుకుని చెరువుల నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షలు జరపడంతో పాటు ఇరిగేషన్ సమన్వయంతో సంబంధిత చెరువుల ఆక్రమణలకు గురి కాకుండా పక్కాగా పరిరక్షణ చర్యలకు సిద్ధమైంది. ఇందుకోసం రూ.55 లక్షలు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు వచ్చే వారంలో జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనను సభ్యుల ముందు పెట్టి ఆమోద ముద్ర పొందిన తర్వాత క్షేత్ర స్థాయిలో చర్యలు చేపట్టనున్నట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలో 13 చెరువులు అక్రమణలకు గురవుతున్నాయని, పరిరక్షణ విషయంలో జీహెచ్ఎంసీ చర్యలు తీసుకోవడం లేదన్న 'గమన' స్వచ్ఛంద సంస్థ ఈడీ దయాకర్ ఫిటిషనర్ సమగ్ర విచారణ చేపట్టిన న్యాయస్థానం జీహెచ్ఎంసీకి మొట్టికాయ వేస్తూనే 13 చెరువుల దయనీయస్థితిపై హైకోర్టు ఇద్దరు కోర్టు కమిషనర్ల కమిటీని నియమించి విచారణ జరిపించింది. న్యాయవాదులు ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి సభ్యులుగా నియమితులైన ఈ కమిటీ.. జీహెచ్ఎంసీ అధికారులు, హైదరాబాద్ , రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు చెరువుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటన్నది పరిశీలించింది. జంట జిల్లాల్లోని 13 చెరువులను పరిశీలించి తమ నివేదికను ఇటీవల హైకోర్టుకు సమర్పించింది. రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్లే చెరువులు ఆక్రమణకు గురయ్యాయని హైకోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఈ చెరువుల కాలుష్యం కేవలం పర్యావరణానికి మాత్రమే కాకుండా.. ప్రజా ఆరోగ్యానికి కూడా త్రీవ ముప్పుగా పరిణమించే అవకాశాలున్నాయని తెలిపింది. ఆక్రమణలు, కాలుష్యం కారణంగా చెరువులపై ఆధారపడిన పక్షులు, జంతుజాలం, జలచరాలు అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇందులో భాగంగానే హస్మత్‌పేట బోయిని చెరువు, చందానగర్ గంగారం చెరువు, దుండిగల్ చిన్న దామెర చెరువు, మద్దెలకుంట చెరువు బైరామల్‌గూడ, నల్లగండ్ల చెరువు, పెద్ద చెరువు ఫీర్జాదిగూడ, అంబీర్ చెరువు కూకట్‌పల్లి, చిన్నరాయుని చెరువు అల్వాల్, దుర్గం చెరువు, ఉప్పల్ నల్ల చెరువు, సున్నం చెరువుల పరిరక్షణపై జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి సారించనున్నది.

దంపతుల దారుణ హత్య కేసులో

నిందితులకు జీవిత ఖైదు

ఎస్పీ నారాయణరెడ్డి

ధారూరు, మార్చి 20 : ధారూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగసముందర్ గ్రామంలో దంపతుల దారుణ హత్యకు కారకులైన నిందితులకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.2వేలు జరిమానా, జరిమానీ కట్టకపోతే సంవత్సరం పాటు కఠిన కారాగార శిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి నేడు తీర్పునిచ్చినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. 6 అక్టోబర్ 2012న ఫిర్యాదుదారు చౌట బాలప్ప అన్న చౌట వెంకటేశం తమ (నాగసముందర్) గ్రామానికి చెందిన తమ పాలివాడు అయిన చౌట మల్లేశంకు తమ అమ్మతో అక్రమ సంబంధం ఉందని చౌట మల్లేశంను చంపి జైలుకు పోయాడు. అప్పటి నుంచి మృతుడి (చౌట మల్లేశం) బంధువులు ఫిర్యాదుదారుడి కుటుంబంపై కక్షతో ఉన్నారు. 24 డిసెంబర్ 2012న చౌట బాలప్ప సాయంత్రం తన ఇంటికి వెళ్లి ఇంటి గొళ్లెం తీసి చూడగా అమ్మానాన్న(చిన్న నర్సింహులు, అంజమ్మ)లు రక్తపు మడుగులో ఉన్నారు. అక్క బాలామణి సృహ కోల్పోయి ఉన్నది. అక్కను లేపి వివరాలు సేకరించాడు. తమ అమ్మనాన్నలను బందెప్ప, మరో ఆరుగురు కలిసి ఆయుధాలతో దాడి చేసి చంపినట్లు.. అడ్డు వచ్చిన అక్కపై వారు ఆయుధాలతో దాడి చేయగా స్పృహ కోల్పోయినట్లు చౌట బాలప్ప పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. అప్పటి ధారూరు ఎస్‌హెచ్‌వో మొదటి ఐవో రమేశ్ నిందితులపై హత్య, హత్యాయత్నం, మారణాయుధాలతో అల్లర్లు, హింస కింద కేసు నమోదు చేశారు. అనంతరం రెండో ఐవోగా అప్పటి ధారూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లచ్చిరామ్, మూడో ఐవో విజయ్‌లాల ఈ కేసులో ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ సమర్పించారు. కేసు వివరాలను పరిశీలించి వాదోపవాదనలు విన్న డిస్ట్రిక్ట్, సెషన్ జడ్జి డాక్టర్ పొన్నం శ్రీనివాస్‌రెడ్డి 302 సెక్షన్ కింద నిందితులు (ఏ2) చౌట లక్ష్మి, (ఏ3)కుర్వ గోపాల్, (ఏ5)కుర్వ అంజయ్య, (ఏ6)చౌట పెంటయ్య, (ఏ7) కుర్వ లక్ష్మిలకు జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున జరిమానా, ఒకవేళ జరిమానా కట్టకపోతే ఒక సంవత్సరం కఠిన కారాగారశిక్ష.. అలాగే.. ఫిర్యాదుదారుడి అక్క బాలామణిపై హత్యాయత్నానికి సంబంధించి 307 ఐపీసీ సెక్షన్ కింద నిందితులకు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.జరిమానా విధిస్తూ తీర్పు ఇవ్వడం జరిగిందని ఎస్పీ తెలిపారు. (ఏ1)చౌట బందెప్ప, (ఏ4)సంగమ్ నర్సిహులు మృతిచెందినట్లు చెప్పారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా పీపీలు జి.నారాయణగౌడ్, వి.రవికుమార్, పి.సుధాకర్‌రెడ్డి, అప్పటి ధారూరు సీఐ లచ్చిరామ్, విజయ్‌లాల, అప్పటి ధారూరు ఎస్‌హెచ్‌వో ఎం.రమేశ్, ప్రస్తుత ధారూరు సీఐ సీహెచ్.రఘురాములు, ప్రస్తుత ధారూరు ఎస్‌హెచ్‌వో అనిత, సీడీపీవో షబ్బీర్ పాషా, శంకర్, లైజనింగ్ ఆఫీసర్ బి.వీరన్న, మహిపాల్‌రెడ్డి పనిచేయడం జరిగిందన్నారు. వీరిని ఎస్పీ అభినందించారు.

మాసబ్ చెరువు బఫర్ పరిధిలో మట్టిని తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

ఆక్రమణను తొలగించిన హైడ్రా

తుర్కయాంజాల్, మార్చి 20 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి మాసబ్ చెరువు బఫర్ జోన్ పరిధిలో అక్రమంగా మట్టి పోసి వేసిన రోడ్డును శుక్రవారం హైడ్రా అధికారులు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి మట్టిని తీసివేశారు. తుర్కయాంజాల్ మాసబ్ చెరువు బఫర్ జోన్ పరిధిలో కొంతమంది వ్యక్తులు అక్రమంగా మట్టిని పోసి రోడ్డు వేశారు. స్థానికుల ఫిర్యాదులతో గతంలో మాసబ్ చెరువును పరిశీలించిన హైడ్రా అధికారులు శుక్రవారం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి జేసీబీ సహాయంతో మట్టిని తొలగించారు. బఫర్ జోన్ పరిధిలోని మట్టిని పూర్తిగా తొలగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హైడ్రా సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఎల్ ఆర్ ఎస్ గందరగోళం

- అస్తవ్యస్తంగా దరఖాస్తుల ప్రక్రియ
- రాయితీ గడువు తేదీ ముంచుకొస్తున్నా.. కార్యాలయాలు దాటని యంత్రాంగం
- తలనొప్పిగా మారిన టెక్నికల్ సమస్యలు
- ఫీజు ఇంటిమేషన్ వస్తున్నా.. పేమెంట్‌కు సహకరించని వెబ్‌సైట్

సిటీబ్యూరో, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం మాయా ప్రపంచాన్ని తలపిస్తున్నది. తమ ప్లాట్లు క్రమబద్ధీకరించుకునే వెసులుబాటు దొరికిందని ఆశపడిన ఎంతో మంది దరఖాస్తుదారులు ఇప్పుడు చుక్కలు చూస్తున్నారు. ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అనుమతించడంతో సంతోషపడిన జనాలే ఇప్పుడు.. ఆందోళన చెందుతున్నారు. కనీసం ప్రభుత్వం 25 శాతం రాయితీతో దరఖాస్తులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా.. ఫీజులు చెల్లించేందుకు ముందుకు రావడంలేదు. దీనికి వెబ్‌సైట్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలే కారణం కాగా, దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించేందుకు ముందుకు రావడంలేదు. ఈ మాయా ప్రపంచంలో అడుగు పెట్టడం కంటే దరఖాస్తులపై స్పందించకపోవడమే ఉత్తమమనే భావన జనాల్లో వ్యక్తమవుతున్నది.

సగానికి కంటే ఎక్కువ ఫీజులు..

ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీంపై ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలు, క్షేత్రస్థాయిలో అధికారులు అమలు చేస్తున్న విధానాలు, ఆన్‌లైన్‌లో చూపుతున్న ప్రాసెస్ అంతా గందరగోళంగా ఉన్నది. హెచ్ఎండీఏ పరిధిలో మూడున్నర లక్షలకు పైగా ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 30 శాతం దరఖాస్తులు క్రమబద్ధీకరణ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని తొలి దశలోనే తిరస్కరించారు. మిగిలిన 2.75 లక్షల దరఖాస్తుల్లో సగానికి కంటే ఎక్కువ ఫీజులు చెల్లించాలని నోటిఫికేషన్ జారీ చేశారు. మిగిలిన వాటిలో ఇప్పటికీ క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఎదురు చూస్తుండగా, ఫీజులు చెల్లించాలని నోటిఫికేషన్లు అందుకున్న వారికి ఇబ్బందులు తప్పడంలేదు. ఫీజులు చెల్లించేందుకు ఇంటి నుంచే వెసులుబాటు కలిగిస్తూ ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినా... అందులో తలెత్తుతున్న టెక్నికల్ సమస్యలు దరఖాస్తుదారుల పాలిట శాపంగా మారుతున్నాయి. ఫీజు పేమెంట్ మోడ్‌లోకి వెళ్లగానే ఒక